## విద్యాసంస్థలు, వసతి గృహాలను సందర్శించాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి



వినతి పత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, జూన్ 23: విద్యా సంస్థలు, వసతి గృహాలను మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల్లో నిరంతరం సందర్శించి తనిఖీలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గ్రీవెన్స్‌లో భాగంగా ఆమె సోమవారం పలువురి బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో పలు విషయాలపై సమీక్షించారు. విద్యా సంస్థలతో పాటు వసతి గృహాల్లో మురుగు నీరు లేకుండా చర్యలు తీసుకొని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశం ఉందని, చెత్తా చెదారం, ముళ్ల పొదలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్రిమి కీటకాలు గదుల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

#### వాల్ పోస్టర్ ఆవిష్కరణ

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025కి సంబంధించిన వాల పోస్టర్ కలెక్టర్ సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆయా అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్లు శ్రీనివాస్, అమిత్ నారాయణ, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస రావు, డీఆర్వో అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

త్రిపురారం, జూన్ 23: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జడ్పీ హైస్కూల్ ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ఇన్‌చార్జి టి.వెంకన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 11వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అడ్మిషన్ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ కోసం ఆధార్ కార్డు, టీసీ, రికార్డు షీట్, కుల ధృవీకరణపత్రం, పాస్‌ఫోటోతో నేరుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలన్నారు.

## నీటి సంరక్షణ అందరి బాధ్యత



పరిశీలిస్తున్న కేంద్ర జలవనరుల అధికారి ఆనంద్‌బాబు

మునుగోడు, జూన్ 23: మండలంలోని 16గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగిన 26 నీటి సంరక్షణ పనులను కేంద్ర జల వనరుల కమిటీ అధికారి ఆనంద్ బాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సంరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఎంపీఓ స్వరూపారాణి, ఏపీఓ నాగరాజు, ఈసీ మల్లేష్, టీఏలు నవనీత, అలివేలు, నాగమణి, కృష్ణవేణి, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## 'నూతన పెన్షనర్స్ చట్టాన్ని రద్దు చేయాలి'

నల్లగొండ, జూన్ 23: కేంద్రం తీసుకొచ్చిన నూతన పెన్షనర్స్ చట్టాన్ని రద్దు చేయాలని అఖిల భారత పెన్షనర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖల భారత స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 250 మంది పెన్షనర్లతో సంతకాలు తీసుకొని కలెక్టర్ ద్వారా మోదీకి పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, నాగేశ్వర్ రావు, నారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీశైలం, రంగయ్య, మోహన్ రావు, ఆంజనేయులు, కృష్ణయ్య, యుగేందర్ రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం



కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 23: యాదగిరిగుట్టలో పారంపర్య వైద్య మహాసంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని జూలై 4, 5, 6 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ సంఘ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని తన కార్యాలయంలో కలిసి వార్షికోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండిట్ శ్రీనివాస్ గురూజీ, మహర్షి, దుర్గారాణి పాల్గొన్నారు.

## ఘనంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



కల్యాణంలో ఆలయ చైర్మన్ వుప్పల రమేశ్, ధర్మకర్తలు

నకిరేకల్, జూన్ 23: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం 126వ మాస శివరాత్రిని పురస్కరించుకుని పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మేరకు ఆలయ పూజారి జిగురు లక్ష్మీనర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు అభిషేకం, తదుపరి గోపూజ కార్యక్రమం, 10 గంటలకు రుద్రహోమం, 11.30 గంటలకు కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్, ధర్మకర్తలు కొండ వెంకన్న, బొప్పని యాదగిరి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి జూన్ 23: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియన వ్యక్తి మృతి చెందిన సంఘటన జాతీయ రహదారిపై చిలమద్రి వద్ద చోటు చేసుకుంది. గుడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలమద్రి సాయి రైస్ మిల్ వద్ద తిరుగుతున్న మతి స్థిమితం లేని వ్యక్తిని ఘనపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు బైక్ ఢీకొట్టింది. గాయపడిన బాధితుడిని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.


## కళాశాలలో అడ్మిషన్లకు గడువు పెంపు

రామగిరి, జూన్ 23: నల్లగొండలోని చర్లపల్లిలో ఉన్న సాంఘీక సాంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో 2025-26 ఏడాదికి వివిధ డిగ్రీ కోర్సులో అడ్మిషన్లకు దరఖాస్తు గడువు ఈనెల 25 వరకు పెంచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా. పవిత్ర వాణి కర్ష సోమవారం వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. మిగతా వివరాలకు 9000229058, 8639109606లను సంప్రదించాలన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చండూరు, జూన్ 23: మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డుకు చెందిన మెండికర్ ఈరోజి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ తోకల వెంకన్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

## జగదీశ్ రెడ్డిని కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గుర్రంపోడ్, జూన్ 23: తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్‌రెడ్డిని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగులవంచ తిరుపతి రావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సమస్యలను వివరించారు. ఆయన వెంట నాయకులు నాగేశ్వర్‌రావు, రాములు తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

తిరుమలగిరి(సాగర్), జూన్ 23: మండలంలోని తూటిపేటతండాలో లబ్ధిదారు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి ఆదేశానుసారం సోమవారం మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్ శంకుస్థాపన చేశారు.

## బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో మమత


మిర్యాలగూడ, జూన్ 23: పట్టణంలోని మైనార్టీ రెసిడెన్సీ, కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు సోమవారం బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను సీడీపీవో మమత వివరించారు. అనంతరం గుడ్, బ్యాడ్ టచ్, అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్ ఎలా ఉపయోగించాలో వివరించారు. కార్యక్రమంలో వెంకటసింహ, స్రవంతి, నాగమణి, ప్రమీల, ప్రిన్సిపాల్ అరుణకుమారి, కోటేశ్వరి, శాంత, నర్మద, సువర్ణ, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

#### చట్టాలపై అవగాహన

కట్టంగూర్, జూన్ 23: చట్టాలు, బాల్య వివాహాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి రేవతి అన్నారు. సోమవారం మండలంలోని అయిటిపాముల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఫోక్సో చట్టం, పర్సనల్ హైజినిక్ న్యూట్రిషన్, బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్వేత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారధారాణి, వార్డెన్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో అనారోగ్యం

### డీఎస్పీ భిక్షపతిరావు





అవగాహన కల్పిస్తున్న యాంటీ నార్కొటిక్స్ డీఎస్పీ భిక్షపతిరావు

మాల్, జూన్ 23: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని యాంటీ నార్కోటిక్స్ డీఎస్పీ భిక్షపతి రావు అన్నారు. సోమవారం చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలతో అనారోగ్యంతో పాటు సమాజంలో చులకన భావం ఏర్పడుతుందన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే నెంబర్1908కి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో అంజయ్య, ఎస్ఐ రామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్లు తీసుకోవాలి: డీఈవో

రామగిరి, జూన్ 23: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు- జనవరి 2025 పరీక్షల లోయర్ గ్రేడ్ డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షల సర్టిఫికెట్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం పరీక్షల విభాగంలో అందుబాటులో ఉన్నాయని డీఈవో భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ హల్‌టికెట్, ఆధార్‌కార్డు తీసుకొచ్చి కార్యాలయంలో తీసుకోవాలని సూచించారు.

## గ్రామీణ సామాజిక సర్వే

చౌటుప్పల్‌రూరల్, జూన్ 23: మండలంలోని చింతలగూడెం గ్రామంలో సోమవారం జాతీయ గణాంక సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో గ్రామ ప్రజల ఆరోగ్య, ఆర్థిక, అక్షరాస్యత, సంక్షేమంపై వివరాలు సేకరించామని ఎన్ఎస్‌వో అధికారులు తెలిపారు. ఈ సర్వేలో జాతీయ గణాంక సంస్థ సభ్యులు కవిత, సుమన్, హపీజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున





శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగార్జున

కట్టంగూర్, జూన్ 23: రాష్ట్ర ప్రభుత్వానికి పేదల విద్యపై చిత్తశుద్ధి లేదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ఆరోపించారు. మండల కేంద్రంలో జరుగుతున్న కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాలను నిర్వీర్యం చేయడంతో పాటు నాలుగేండ్లు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమిడాల పరుశరాములు, సీఐటీయూ జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్ల మస్తష్, ఒంటెపాక కృష్ణ, గాదె నర్సింహ, మల్లయ్య, రవీందర్, పెరిక విజయ్‌కుమార్, చిలుముల రామస్వామి, దండు రవి, దేవయ్య, బాబురావు, బొల్లంపల్లి రవి, శ్యామ్, ముసుకు రవీందర్ పాల్గొన్నారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



నకిరేకల్: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

నకిరేకల్, జూన్ 23: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి పురస్కరించుకుని సోమవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళీమోహన్ ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మండల అధ్యక్షుడు సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సాయన్న, సైదులు పాల్గొన్నారు.

#### శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

చిట్యాల, జూన్ 23: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్‌ను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్, పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొగులయ్య, కార్యదర్శి శ్రీనివాసు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

### బీసీ యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గిరి అశోక్

మిర్యాలగూడ, జూన్ 23: బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాటాడారు. బీసీ రిజర్వేషన్లకు చట్టం అమలు చేయకుండా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే ఊరుకునేది లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉన్నప్పటికీ ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం మీదకు నెట్టడం నీచమైన చర్య అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మురళీయాదవ్, ఈశ్వరచారి, రాములు, సైదులు తదితరులు ఉన్నారు.

## ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

చిట్యాల, జూన్ 23: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సీఐ నాగరాజు అన్నారు. అంతర్జాతీయ యాంటి డ్రగ్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఐ అమ్రీన్ నసీన, పోలీసు సిబ్బంది, నాయకులు చినమల్లయ్య, దేవదాసు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి



డీఈవో భిక్షపతికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మిర్యాలగూడ, జూన్ 23: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని డీఈవో బొల్లారం భిక్షపతికి సోమవారం బీసీ విద్యార్థి సంఘం, బీసీ రాజ్యాధికార సమితి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగులా పుట్టుకొస్తున్నా ఎంఈవోలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నారన్నారు. విద్యార్థుల నుంచి రూ.లక్షల్లో ఫీజులను తల్లిదండ్రుల నుంచి బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో జనార్దన్‌గౌడ్, యాదగిరి, లక్ష్మణ్‌నాయక్, సైదులుగౌడ్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలి

### ఏపీడీ శ్రవణ్‌కుమార్




మాట్లాడుతున్న ఏపీడీ శ్రవణ్‌కుమార్

త్రిపురారం, జూన్ 23: మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలని ఏపీడీ శ్రవణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో సోమవారం ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు 3రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చెక్ పవర్, విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అభివృద్ధి చెందాలన్నారు. మహిళా సంఘాల ద్వారా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఆదర్శ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫాంలు కుట్టడం, సోలార్ ప్లాంట్‌ల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాడి పరిశ్రమ, టైలరింగ్, కిరాణ షాపులు వంటి వ్యాపారాలను చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం అరుణ్‌కుమార్, ఏపీఎం అశోక్‌కుమార్, సీసీలు మురళీ, హేమానాయక్, దేవ్‌సింగ్, సీఆర్‌పీలు తిరుమల, సుమతి, మండల అధ్యక్షురాలు నాగమణి, వీవోఏలు రాణి, విజయ, ఎన్ఎస్ఏ అలివేలు, అన్ని గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, వీబీకేలు పాల్గొన్నారు.

## లబ్ధిదాలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం




బొక్కమంతల పహాడ్‌లో మంజూరు ఉత్తర్వులు అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ సత్యం, వల్లభ్‌రెడ్డి

నిడమనూరు, జూన్ 23: అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడడు యడవల్లి వల్లభ్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొక్కమంతల పహాడ్, ఊట్కూరు, నందికొండ వారి గూడెం, గుంటిపల్లి, బంటువారి గూడెం, వేంపాడు, నారమ్మ గూడెం, వడ్డెరి గూడెం, పార్వతీపురం, రాజన్న గూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ పథకాన్ని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో గృహనిర్మాణ ఏఈ మేఘన, నాయకులు శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు విజయ్ కుమార్, కృష్ణయ్య, నరేందర్‌రెడ్డి, షేక్ జానీపాషా, కృష్ణ, యాదగిరి తదితరులున్నారు.

## బనకచర్ల నీటి సమస్యపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

### మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి





మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జూన్ 23: బనకచర్ల నీటి సమస్యపై ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యాద్గార్‌పల్లిలో ఉన్న ఎస్ఎన్‌డీ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గోదావరి జలాలపై ఏపీ ప్రభుత్వం నిర్మించే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నీటి జలాలపై అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తిన బనకచర్లపై ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, చౌగాని సీతారాములు, అయూబ్, గాదె పద్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ, జూన్ 23: మండలంలోని నందిపాడు గ్రామ శివారలోని కేశవ దాబా హోటల్ వద్ద సోమవారం అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన షేక్ మౌలానా అతని భార్య షేక్ షాహీనాలు ఉప్పు, ముగ్గు అమ్ముతూ అదే సమయంలో రేషన్‌కార్డు దారుల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తేలింది. ఈ మేరకు ఆటోను సాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## డ్రైనేజీలో చెత్తాచెదారం తొలగింపు





డ్రైనేజీలో చెత్తను తొలగించిన మున్సిపల్ సిబ్బంది

నకిరేకల్, జూన్ 23: ఈ నెల 22వ తేదీన 'అస్తవ్యస్తంగా డ్రైనేజీ' అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం పట్టణంలోని మూసీరోడ్డులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట ఉన్న డ్రైనేజీలో చెత్తాచెదారాన్ని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ మేరకు మురుగునీటిపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కాగా, చెత్తచెదారాన్ని తొలగించడంతో ఎంపీడీఓ కాంప్లెక్స్‌లోని వ్యాపారులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మిర్యాలగూడ, జూన్ 23: పట్టణంలోని పలు కాలనీల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వన్‌టౌన్ ఏఈ మహేష్ సోమవారం తెలిపారు. ఈ మేరకు రామచంద్రగూడెం, చైతన్యనగర్, చౌదరికాలనీ, తాళ్లగడ్డ, తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీ, రాంనగర్‌తోపాటు పలు కాలనీల్లో ఉదయం 8గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రామచంద్రగూడెం సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ రామచంద్రగూడెం ఫీడర్ కింద విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

#### విద్యుత్ అంతరాయం

నల్లగొండ సిటీ జూన్ 23: కనగల్ మండల సబ్‌స్టేషన్‌లో మెయింటనెన్స్ కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని సోమవారం విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కనగల్ సబ్‌స్టేషన్ పరిధిలోని కనగల్, జీయడవల్లి, పోనుగోడు గ్రామాల పరిధిలో అగ్రికల్చరల్ 3ఫేస్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు.

## పుస్తక విక్రయాల అడ్డగింత

చిట్యాల, జూన్ 23: మండల కేంద్రంలోని గ్రీన్ గ్రో స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆవరణలలో అనుమతులు లేకుండా పాఠ్య పుస్తకాలు విక్రయింస్తుండగా సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల ఆవరణలో పుస్తకాలు విక్రయించడం నేరమన్నారు. అనంతరం ఈ విషయంపై ఎంఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణీత్, జీవన్, శివ, వంశీ, నిఖిల్, సాయి పాల్గొన్నారు.

## అక్రమ పశువుల రవాణా వాహనం పట్టివేత

చౌటుప్పల్‌రూరల్, జూన్ 23: మండలంలోని తూఫ్రాంపేట గ్రామ పరిధిలో సోమవారం అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కొమినెపల్లి గ్రామంలో పశువులను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు వాహనంలో తరలిస్తుండగా డ్రైవర్ లకావత్ నాగేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


## ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని ధర్నా

నల్లగొండ రూరల్, జూన్ 23: జిల్లాలో అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని సీపీఐ పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పలు పర్యాయాలు అధికారులకు విన్నవించిన సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సైదిరెడ్డి, వెంకట్, కేస్‌రెడ్డి, పబ్బు వీరాస్వామి, సుజాత పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో యువకుడికి గాయాలు

శాలిగౌరారం, జూన్ 23: విద్యుత్ స్తంభం ఎక్కిన యువకుడికి షార్ట్ సర్క్యూట్ కావడంతో స్తంభంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయాలపాలైన సంఘటన మండలంలోని బైరవుని బండ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పటి నవీన్ తన వ్యవసాయంలో బోరు మోటార్‌కు కనెక్షన్ కోసం వైర్లను కలిపేందుకు స్థానిక సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి కరెంటు సరఫరాను నిలిపివేయాలని సమాచారం ఇచ్చాడు.అయితే అంతలోనే నవీన్ స్తంభం ఎక్కి వైర్లను సరిచేస్తున్న క్రమంలో కరెంటు పునరుద్ధరించడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఒక్కసారిగా స్తంభం పై నుంచి నవీన్ కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే నల్లగొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రామగిరి, జూన్ 23: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ డీఈవో భిక్షపతికి సోమవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల 14 ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో సర్వే చేశామన్నారు. జిల్లా కేంద్రంలోని జేబీఎస్, పద్మనగర్‌లోని పాఠశాల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిపడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా కేసరాజుపల్లి, డీవీకే రోడ్డు, మర్రిగూడ ఉన్నత పాఠశాలలో కిచెన్ గదుల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, కోట్ల అశోక్‌రెడ్డి, అద్దంకి నర్సింహ తదితరులున్నారు.

## తూతూమంత్రంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు

వేములపల్లి, జూన్ 23: స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగుతుండడంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని శెట్టిపాలెం గ్రామంలో ప్రొసీడింగ్స్ ఇవ్వకుండానే శంకుస్థాపన పనులను అధికారులు ప్రారంభించారు. గ్రామంలో సుమారు 90 ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని చెబుతున్నా.. ఈ ఇండ్లకు కలెక్టర్ స్థాయిలో ప్రొసీడింగ్స్ రాలేదు. అయితే ఎటువంటి ప్రొసీడింగ్స్ లేకుండానే కాంగ్రెస్ నాయకులు, అధికారులు కలిసి నామమాత్రంగా ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి ప్రారంభించారు.